ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


వెలంపల్లి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి


భవానీపురం లారీస్టాండ్‌లో వాసుకు శుభాకాంక్షలు చెబుతున్న రఫి, వెంకటబాబు తదితరులు


పాతబస్తీలో కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకుంటున్న ఓ కుటుంబం


వెలంపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న చంటిబాబు తదితరులు

వన్‌టౌన్/భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సర వేడుకలను విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12గంటలు దాటిన తర్వాత యువతీయువకులు, చిన్నారులు, ప్రజలు కేక్‌లు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముంగిళ్లను అందమైన రంగవల్లులతో అలంకరించారు. న్యూ ఇయర్ వేడుకులను పురస్కరించుకుని ప్రజలు ఆలయాలు, ప్రార్ధనా మందిరాలను సందర్శించి పూజలు చేశారు. విశ్వాసులు చర్చిలలో ప్రార్థనలు చేశారు.

వెలంపల్లిని కలిసిన నాయకులు..

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యులు, పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావుకు పార్టీకి చెందిన నాయకులు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో వారు వెలంపల్లిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయ ప్రముఖులు కార్పొరేటర్లతోపాటుగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి దంపతులు వెలంపల్లిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, ఆంజనేయరెడ్డి, కోటిరెడ్డి, ఇర్ఫాన్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు విశ్వనాథ రవి, మైనార్టీ సెల్ అధ్యక్షులు మస్తాన్, పాదిలి చంటిబాబు, లేళ్లపూడి లాజర్, బడుగు చిన్నా తదితరులు ఉన్నారు. వెలంపల్లి మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి అందరూ కృషిచేద్దామని పిలుపునిచ్చారు. అదేవిధంగా వలంటీర్ ఎడ్యుకేషన్, ఎకనామిక్ డెవలప్‌మెంట్ (వీడు) సొసైటీ డైరెక్టర్ వాసుకు భవానీపురం లారీ సప్లయిర్స్ అసోసియేషన్ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎండీ రఫీ, సలాది వెంకటబాబు, కూరపాటి శ్రీనివాసరావు, కన్నబాబు పాల్గొన్నారు.

పాతబస్తీలో సందడి..

పాతబస్తీలోని మంగళవారం అర్ధరాత్రి యువకులు రోడ్లపైకి చేరుకొని సందడి చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ హడావుడి చేశారు. ప్రతి చోటా కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అలాగే మిత్రబృందాలతోపాటుగా చాలా ఇళ్లలోనూ కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

వీధి విక్రయదారుల కమిటీ ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీధి విక్రయాలు చేసే వ్యాపారుల అభివృద్ధికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (యూబీఎస్)ల సిఫార్సు మేరకు కమిటీని ఏర్పాటు చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ కమిటీలో 7 మంది సభ్యులు ఉంటారని, అందులో వివిధ రకాల వీధి విక్రయాలు చేసేవారు, ఒక ఎన్‌జీవో (నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్) ప్రతినిధి, ఒక సీబీవో (కమ్యూనిటీ బెస్ట్ ఆర్గనైజేషన్) ఒకరు ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీకి ఆసక్తి కలిగిన వీధి విక్రయదారులు, ఎన్‌జీవోల నుంచి, సీబీవోల నుంచి దరఖాస్తులను 30 రోజుల లోపు వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పట్టణ సాధికార విభాగంలో అందించాలని తెలిపారు. ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ ద్వారా కమిటీ సభ్యులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతోపాటు ఆధారుకార్డు కాపీ, వీధి విక్రయదారుల గుర్తింపు కార్డు కాపీ, వీధి విక్రయదారుల సర్టిఫికెట జతపరచాలని సూచించారు. వివరాలకు 7901610071 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుమారు 30మంది శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. నటరాజ నృత్యాలయం నుంచి ఇప్పటివరకు సుమారు 250 మందికి పైగా చిన్నారులు అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శనలు ఇచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించడంతోపాటు వారికి ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదాలు, దేవస్థాన ప్రశంసాపత్రాలను అందజేశారు.

అష్టదిగ్బంధంలో కనకదుర్గనగర్



కనకదుర్గనగర్‌లో ఇష్టారీతిన పార్కింగ్ చేసిన వాహనాలు, ఇబ్బందులుపడుతున్న భక్తులు

- ఇష్టారీతిన వాహనాల పార్కింగ్
- అడుగు వేసేందుకు తప్పని అవస్థలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సర వేళ అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు దేవస్థాన అధికారులు పరీక్ష పెట్టారు. సీఎం చంద్రబాబు అమ్మవారి దర్శనానికి విచ్చేయడంతో ఘాట్‌రోడ్డుపైకి ఉదయం నుంచి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల రాకపోకలను నిలిపివేశారు. నడిచి వెళ్లే భక్తులను సైతం కొంత మందినే అనుమతించారు. దీంతో భక్తులు కనకదుర్గనగర్‌లో వాహనాలను నిలుపుకుని మహామండపం లిఫ్ట్, మెట్లమార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. నూతన సంవత్సరం వేళ అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి మహా మండపం వైపే భక్తుల రాకపోకలు సాగిస్తుండటంతో మధ్యాహ్నానికి పరిస్థితి చేతి దాటిపోయింది. భక్తులు ఇష్టానుసారంగా తమ ద్విచక్ర వాహనాలను నిలుపడం, వీఐపీల పేరిట విచ్చేసిన వారు కనకదుర్గనగర్ నుంచి గోశాల వరకు ఇష్టానుసారంగా కార్లను నిలిపివేయడంతో భక్తులు అడుగుతీసి అడుగు వేసే పరిస్థితి కనిపించలేదు. దీంతో కనకదుర్గనగర్‌లో సుమారు గంట పాటు భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది. అదేసమయంలో వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు కనకదుర్గనగర్‌లో పోలీసు, హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బంది కానీ కనిపించకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యేవరకు ఇదే పరిస్థితి కనిపించింది.

భక్తులతో ఆలయాలు కిటకిట


కొత్తగుల్లు కోదండరామాలయంలో ప్రత్యేకాలంకరణలో స్వామివార్లు


జమ్మి వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో బుధవారం కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం నుంచి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకా చేశారు. కొత్తగళ్ల ప్రాంగణంలోని శ్రీ నగరేశ్వరస్వామి సన్నిధికి కూడా భక్తులు పోటెత్తారు. కోదండరామునికి ప్రత్యేక అలంకారం చేశారు. కెనాల్‌రోడ్డులోని వినాయకుని దేవస్థానంలో రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. శ్రీప్రార్థనామందిరంలో వేంచేసియున్న శ్రీకృష్ణుడు, సంకల్పసిద్ధి హనుమాన్ ఆలయాలు సైతం భక్తులతో కళకళలాడాయి. కొత్తపేట సైకం వారివీధిలో వేంచేసి ఉన్న శ్రీ దర్వేశ్వరస్వామి వారి దేవస్థానం, గణపతిరావు రోడ్డులోని శ్రీ పండరిసాయి మందిరం భక్తులతో కిటకిటలాడాయి. కేటీరోడ్డులోని జమ్మి వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేష్ పూజలు చేశారు. నూతన సంవత్సరం ఆగమనాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శేషయ్యవీధిలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం, కేటీరోడ్డులోని గంగానమ్మదేవస్థానం తదితర ఆలయాలు సైతం భక్తులతో రద్దీగా మారాయి.

వయో వృద్ధులు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

స్వచ్ఛాంధ్ర మిషన్
మాజీ చైర్మన్ సీఎల్ వెంకట్రావు


నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన వెంకట్రావు

గాంధీగనర్(విజయవాడసెంట్రల్): వయో వృద్ధులు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని స్వచ్ఛాంధ్ర మిషన్ మాజీ చైర్మన్ సీఎల్ వెంకట్రావు అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో ఎన్టీఆర్ జిల్లా వరిష్ఠ పౌరుల సంక్షేమ సంఘం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కేక్ కట్ చేసి సీనియర్ సిటిజన్స్ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ సమాజంలో వృద్ధుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఇలాంటి సంఘాలు అన్ని గ్రామాల్లో విస్తరించాలని కోరారు. వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన సంఘం రజోత్సవ వేడుకలపై సమీక్షించారు. వేడుకల నిర్వహణకు సహకరించిన వారికి జ్ఞాపికలు అందజేశారు. మానవతా సంస్థ అధ్యక్షుడు చెరుకూరి బాబు, సంఘ అధ్యక్షుడు వేమూరు బాబురావు, కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి డి.సాంబశివరావు సామాజిక కార్యకర్తలు నార్ల వెంకటేశ్వరరావు, మాలతి, అసోసియేషన్ ప్రతినిధులు కడియాల శాంతి , నేమాని కామేశ్వరి, నాదెళ్ల సుమతీ దేవీ, అరుణాచలం, భూపతి రాజు సత్య నారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ


భక్తులతో కిటకిటలాడుతున్న దుర్గమ్మ ఆలయం


అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఆర్జిత సేవలకు డిమాండ్


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ కనిపించింది. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చాన, శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమంతోపాటు శాంతి కళ్యాణాలను ఉభయదాతలు తమ నామగోత్రాలతో జరిపించుకున్నారు. మరోవైపున ఉదయం నుంచి భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అమ్మవారి అంతరాలయ దర్శనాన్ని ఆలయ అధికారులు నిలిపివేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఘాట్‌రోడ్డుపైకి వాహనాలను అనుమతించలేదు. మరో వైపున మహామండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా వచ్చే భక్తులను 5వ అంతస్తు వరకు అనుమతించి అక్కడి నుంచి క్యూలైన్‌లోకి మళ్లించారు. దీంతో అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఈశ్వర్ సేవలు అభినందనీయం


ఈశ్వర్ దంపతులను అభినందిస్తున్న వీఎంసీ అధికారులు, ఏపీ జేఏసీ ప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దొప్పలపూడి ఈశ్వర్ స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం అభినందన సన్మాన సభ నిర్వహించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసి, విజయవాడ నగరపాలక సంస్థ ఉద్యోగులకు ఉద్యోగులకు 010 పద్దు కింద చేర్చడానికి ఈశ్వర్ ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా వీఎంసీలో వివిధ హోదాల్లో పనిచేసి అధికారుల నుంచి, ప్రభుత్వాల నుంచి మెప్పు పొందారని పేర్కొన్నారు. వీఎంసీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ బ్యాంకునకు మూడు పర్యాయాలు ప్రెసిడెంట్‌గా, ఇప్పటికీ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారని చెప్పారు. ఈశ్వర్ హయాంలోనే సభ్య ఉద్యోగులకు మట్టి ఖర్చులు, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించారన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కి 4 పర్యాయాలు ప్రెసిడెంట్‌గా, నాలుగు సార్లు జనరల్ సెక్రటరీగా, ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ మినిస్టీరియల్ అసోసియేషన్‌కు జనరల్ సెక్రటరీగా పనిచేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు, వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ విజయవాడ యూనిట్ అధ్యక్షుడు తిమ్మసర్తి నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి సలీం అహ్మద్, ఏపీ జేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అమరావతి అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు, మునిసిపల్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అక్కరబోయిన అప్పలరాజు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పి. లక్ష్మి కె.శివరామ ప్రసాద్, ట్రెజరర్, రవి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస రావు, విజయలక్ష్మి, సంగీతరావు, టి. నాగరాజు, శ్రీకాకుళం, విశ్వనాథరెడ్డి, గాలి సుధాకర్, తిరుపతి, మోహన్ గోపాల్, అమర్నాద్ రెడి, వెంకట కృష్ణ, కే. కళ్యాణ చక్రవర్తి, ఎం. అప్పలరాజు, జాన్ పాల్ కాకినాడ, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన నాయకులు కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి అవినాష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

శ్రీకృష్ణునికి పుష్పయాగం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భగవారాధనతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికితే శుభం కలుగుతుందని కూరపాటి చంద్రశేఖరరావు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధారాచార్య అన్నారు. పాతబస్తీలోని పాఠశాలలో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ పాఠశాలలో శ్రీ కృష్ణ భగవానుడి విగ్రహానికి వేలాది గులాబీ, చామంతి పుష్పాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీపుష్పయాగం నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు మాట్లాడుతూ భగవంతుని ఆరాధనతో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయన్నారు. దీపాలు ఆపి కేకులు కోయుట మన సంప్రదాయం కాదని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

బాబా సేవలో ఆదాయపన్ను ప్రధాన కమిషనర్ సునీత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో బాబావారిని బుధవారం సాయంత్రం ఆదాయపన్ను ప్రధాన కమిషనర్ సునీత బిళ్ళా దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రా షిరిడీగా విరాజిల్లుతున్న బాబా మందిరంను దర్శించటం ఆనందంగా ఉందన్నారు. బాబా మందిరంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సేవాకార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ వివరించారు. తొలుత ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేష వస్త్రం చిత్రపటంను సునీతకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు పుస్తకమహోత్సవంలో కార్యక్రమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సాయంత్రం 6 గంటలకు సాహిత్యవేదికపై పుస్తకమహోత్సవ ప్రారంభసభ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. దివంగత ప్రధాని పీవీ నరసింహారావు సాహితీ జీవితంపై పుస్తకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికాశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ మొదటి ప్రతిని స్వీకరిస్తారు. ఈ సభలో సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పుస్తక రచయిత కృష్ణారావు పాల్గొంటారు. పిడికిటి రామకోటేశ్వరరావు సంస్మరణ సభ ఉంటుంది. దీనికి పుస్తకమహోత్సవ సంఘం గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ అధ్యక్షత వహిస్తారు. తానా పూర్వ అధ్యక్షులు కోమటి జయరాం, పుస్తకమహోత్సవ సంఘం పూర్వ అధ్యక్షులు అశోక్ కుమార్ సభలో వక్తలుగా పాల్గొంటారు.

పదిమంది ఉద్యోగాలు క్రమబద్ధీకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో 20ఏళ్లుగా ఎన్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్న పదిమంది ఆలయ పరిచారకులను క్రమబద్ధీకరిస్తూ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న కె.నాగరాజు, కె.కేశవరావు, ఎం.వి.ఎస్.శాస్త్రి, సీహెచ్.పిచ్చయ్యశాస్త్రి, ఎం.రాధాకృష్ణమూర్తి, పి.అశ్విన్‌కుమార్, జి.రామారావు, కె.ప్రవీణ్‌శాస్త్రి, కె.ప్రశాంత్‌శాస్త్రి ఈ జాబితాలో ఉన్నారు. ఆలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మరో 54 మంది ఎన్ఎంఆర్‌లు తమను కూడా క్రమబద్ధీకరించాలని, అందుకు తమకు అన్ని అర్హతలు ఉన్నాయని దేవదాయశాఖ ముఖ్యఅధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆలయానికి విచ్చేసిన తరుణంలోనూ కలిసి వినతిపత్రం సైతం అందజేశారు. ప్రభుత్వం తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ విషయంలోనూ సానుకూలంగా స్పందించాలని వారు కోరుతున్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పెనమలూరు:కంకిపాడు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో బుధవారం ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ క్యాలెండర్, డైరీ, స్టిక్కర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యు.టైటాస్‌పాల్, నేతలు ఎ.శ్రీనివాసమూర్తి, పి.వి.కృష్ణమోహన్, జయరాజ్, అబ్దుల్‌కాలిక్, కె.పిచ్చేశ్వరరావు, ఎ.సత్యవంతు, పి.సురేష్‌బాబు, ఐ.నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

జూడోలో సత్తా చాటిన సిద్ధార్థ విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గత నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో టోర్నమెంట్‌లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఈ పోటీల్లో ఆ కళాశాల విద్యార్థినులు బి.భావన , జి.ప్రవల్లిక, సీనియర్ సబ్‌జూనియర్ జూడో కాంపిటీషన్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్‌ను పొందినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తెలిపారు. దీంతో త్వరలో జరిగే సీనియర్ నేషనల్స్‌కు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన భావన, ప్రవల్లికను ప్రిన్సిపాల్ పద్మజతో పాటు, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నేడు ప్రమాణ స్వీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గురువారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. రజక సామాజిక వర్గీయులు పాల్గొని ఈ వేడుకను జయప్రదం చేయాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఎస్ఈ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 2వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎన్టీఆర్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎ. మురళీమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఫోన్‌లో సంప్రదించాలని కోరారు. వినియోగదారులు 0866-2575620 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.